
# సాఫల్యం

యస్.యస్. ప్రసూన



ఆ రోజు వుదయంనుండి ఇల్లంతా హడావుడిగా వున్నది. పాలేళ్ళు ఇక్కడ వస్తువు అక్కడ, అక్కడిదిక్కడ సర్దుతూ "చినబాబు వస్తున్నాడు. చినబాబు వస్తున్నా"డని వుత్సాహంగా తిరుగుతున్నారు.

"అమ్మాయ్! టైమెంత అయిందమ్మా— రంగన్న బండికట్టుకుని స్టేషన్ కువెళ్లాడా?" అని పదోసారి అడిగేరు హాల్లో మంచంమీద పడుకున్న పరంధామయ్యగారు.

"రైలు వచ్చే టైము అయింది నాన్నారూ" అంటూ వాకిట్లోకి తొంగిచూసింది సుభద్ర.

"ఏమిటమ్మా! ఇంతప్రొద్దున్నే సందడిగా వున్నారు" అడుగుతూ పక్కింటి పంతులుగారు వచ్చారు.

"ఇవాళ అన్నయ్య వస్తున్నాడు" వుత్సాహంగా చెప్పింది సుభద్ర.

"ఏమిటీ! అబ్బాయి వస్తున్నాడా? చెప్పావు కాదు" పరంధామయ్యగారి మంచందగ్గిర కుర్చీలో కూచున్నారు పంతులుగారు.

"రాత్రే టెలిగ్రామ్ వచ్చింది. మీకు కబురు చేద్దామనుకుంటున్నాను. ఇంతలో మీరే వచ్చారు" అన్నారు పరంధామయ్యగారు.

"ఇవాళ నీకు మనవుగా వున్నట్లేనా? అబ్బాయి వస్తున్నాడుగా ఇంక నీ రోగమూ అదీ ఎగిరి తక్కాపోతుందిలే" నవ్వుతూ అన్నారు పంతులుగారు. "ఏమో పిచ్చివాయన ఎలావున్నాడో రెండు సంవత్సరాలైంది చూసి" పితృవాత్సల్యంతో అన్నారు పరంధామయ్యగారు.

"బావుంది రేపు డాక్టరుగారితండ్రివన్న గౌరవం తగిలించుకుని తిరగవూ! అప్పుడు మాలాటివాళ్ళం కనిపిస్తామో లేదో."

ఇంతలో వాకిట్లో బండి ఆగిన శబ్దమైంది. గదిలోంచి పరిగెత్తుకువచ్చిన సుభద్ర, "అమ్మా అన్నయ్య వచ్చేడేయ్" అని కేక పెట్టి వాకిట్లోకి పరుగుతీసింది. రమణమ్మ చేతిలో పని వదిలి హాల్లోకి వచ్చింది. బండిదిగివచ్చిన మధు ఎదురైన చెల్లెల్నిచూసి నవ్వుతూ బాగున్నావా సుభా అని ఆప్యాయంగా పలకరించాడు "వూ...వూ" అని చిన్నగా నవ్వుతూ అన్నచెయి పట్టుకుని హాల్లోకి వచ్చింది. "అదేమిటి నాన్నగారూ పడు



కున్నారే?" గబగబా తండ్రి మంచందగ్గిరకు వచ్చాడు మధు.

"అబ్బే! ఏంలేదు కొద్దిగా జ్వరం వస్తోంది వారంనుండి. ఇప్పుడు తగ్గిపోయిందిలే. నువ్వు కులాసాగా వున్నావా? ప్రయాణం అదీ సుఖంగా జరిగిందా?" లేని వోపిక తెచ్చుకుని మెల్లగా కూచుంటూ అన్నారు పరంధామయ్యగారు.

"బాగున్నావుటోయ్ మధుమూర్తీ" పంతులు గారు పలకరించారు.

"నమస్కారమండీ పంతులుగారూ. మీ దయ వలన బాగానే వున్నాను." చేతులు జోడించాడు మధు.

"దీర్ఘాయుష్మాన్‌భవ - శ్రీఘ్రమే కళ్యాణ ప్రాప్తిరస్తు" మధుని దీవించి, ఏమయ్యా పరంధామం నీ కొడుకు ఫారిన్ రిటర్న్‌డ్ అయాడు ఇంక నీ రొట్టెవిరిగి నేతిలో పడ్డట్టే కట్నాల మార్కెట్‌లో మీ వాడిరేటు ఒక లక్షారందాకా ఎగబాకించవచ్చు" అని గలగలా నవ్వి "ఏవన్నా ఆలోచనలోవున్నాయా- ఆ మూడుముళ్లు కూడా వేయిస్తే యింక నీ బాధ్యత తీరినట్టే."

"అదే అనుకుంటున్నాను పంతులుగారూ! అమ్మాయికెలాగూ సంబంధం సెటిలయ్యేవున్నది. వీడికికూడా ఎదన్నా కల్సివస్తే ఈ వేసంగిలో ఇద్దరికీ కానిచ్చేదామని వున్నది. ఏవో రెండు మూడు ఆలోచనలో వున్నాయనుకోండి. పాలెంలో రంగరాజుగారని పెద్ద భూస్వామి వున్నాడు ఎరుగుదురా. వారి రెండో అమ్మాయిని గురించే ప్రస్తుతం రాయబారాలు జరుగుతున్నాయి. అంతా భగవంతుని దయ" సాలోచనగా అన్నారు పరంధామయ్యగారు.

"రంగరాజుగారిని ఎరక్కపోవటమేమిటి! సిరిసంపదలతోపాటు మంచి సంప్రదాయం గలవాడు. ఎన్నదగిన సంబంధమే అది. మంచిచోటే గాలం వేసినేవు అఖండుడివయ్యా పరంధామం!" గట్టిగా నవ్వేరు పంతులుగారు.

ఈ ధోరణి ఏమీ నచ్చనట్లు ఇబ్బందిగా కదిలేడు కుర్చీలో మధు.

తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా అంతా గలగలా వాళ్ళే మాట్లాడేస్తూంటే, ఇన్నాళ్ళకు వచ్చిన కొడుకువంక మనస్సునిండిన సంతోషంతో చూస్తూ గుమ్మం పట్టుకుని నిల్చున్న రమణమ్మ. "ఏమిటండీ! బిడ్డ గుమ్మంలో అడుగు పెట్టేడోలేదో మీ వ్యవహారాలూ మీరూ" కాస్త కాళ్లు కడుక్కోనివ్వటం అదీ లేదేమిటీ అంటూనే "లే బాబూ స్నానం చేద్దువుగాని." ఒరే వీరిగా అబ్బాయికి వేన్నీళ్ళు తొరపరా దొడ్లో పాలేర్ని కేకేసి చెప్పి- సుభద్రా అన్నయ్యకేంకావాలో చూడు" అని అందరికీ అన్నీ గబగబ చెప్పి తను వంటఇంట్లోకి వెళ్ళింది రమణమ్మ.

స్నానంచేసి పైజామా, షర్టు వేసుకుని వంట ఇంట్లోకి వచ్చి తల్లిదగ్గరగా పీటవాల్చుకు కూర్చున్న మధు "అమ్మా! అలావున్నావేమిటమ్మా కులాసాగా వుండటంలేదూ?" తల్లి ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"ఏదోలే బాబూ - పెద్దవాళ్ళం ఇలా ఇలా వున్నాం. మా మాటకేంగాని, నువ్వింత చిక్కిపోయావేమిట్రా! చదువో చదువో అంటూ దేశాలు పట్టుకు తిరగటమే సరిపోతూంది. మరి రేండేళ్ళబట్టి కంటికి కనబడకపోతివి మా మనస్సులు ఎల్లావుంటాయి చెప్పు. బిడ్డని మళ్ళీ నట్టింట్లో ఎప్పుడు తిరుగుతావా అని మనస్సు ఎంత మదనపడిపోతూందో. ఏ పనిమీంది వున్నా రనీ- అవీ నువ్వేగా! మీ ఇద్దరూ మాకు రెండు కళ్ళు లాటివాళ్ళు మీరు సుఖంగా వుండేదాలు- ఏమిటో మేమింత వెంపర్లాడుతాం గాని, కాస్త వయస్సువచ్చే సరికి గూడు వదిలిన పక్షుల్లాగా రెక్కలు విదుపుకుంటూ ఎగిరిపోతారేగాని- అమ్మా నాన్న ఏమైపోతారో అన్న ఇది వున్నదీ! తల్లి మనస్సు నీకు ఏం తెలుస్తుంది బాబూ అన్నది" రమణమ్మ. ఆమె గొంతులో కొడుకు ఇన్నాళ్ళు తనకు దూరంగా వున్నాడన్న తపన ఇకముందు ఎక్కడ ప్రాక్టీసు పెడ్తాడో అన్న భయం ధ్వనించింది.

"లేదమ్మా ఇంక ఎక్కడకూ వెళ్ళను. నాన్నగార్ని- నిన్ను పువ్వుల్లో పెట్టినట్లు చూసుకుంటానంటే నమ్ము. నేనింతవాణ్ణి అయానంటె నీ చలవేగామ్మా" నవ్వుతూ అన్నాడు మధు.

"మా నాయనే అంతమాత్రం మాటఅన్నావు చాలు" కాఫీగ్లాసు అందిస్తూ ఆప్యాయంగా అన్నది ఆవిడ.

కాఫీత్రాగి గ్లాసుక్రింద పెటి. "అమ్మా, రాజయ్య మామయ్యగారి ఇంట్లో అంతా బావున్నారా?" ఆత్రంగా అడిగాడు. రమణమ్మ చప్పున మొహం ముడుచుకొని "ఆ, ఏం బాగులే-"

"రాజయ్యగారు పోయారు. నాలుగైదు నెలలవుతోంది. హఠాత్తుగా పోయారు. గుండె జబ్బని చెప్పుకున్నారు" ఇష్టంలేనట్లు, గొణుక్కున్నట్లుగా చెప్పింది.

గతుక్కుమన్నాడు మధు. వస్తూనే విషాద వార్త వినటం అపశకునంగాతోచింది. అందులోనూ రాజయ్య మామయ్య పోయాడని వినటం మరీ బాధగా వున్నది వ్యక్తీకరించని భయమేదో గుండెల్లోంచి దూసుకుపోయింది. అది కప్పిపుచ్చుకుంటూ తల్లితో అదీ ఇదీ మాట్లాడుతున్నాడేగాని మనసు మాత్రం రాజయ్యగారి ఇంటివేపు పరుగుతీసింది.

అంతసేపు అక్కడే కూచుని పూలమాల కడుతున్న సుభద్ర "అన్నాయ్ నా కేమితెచ్చావు?" వుత్సాహంగా అడిగింది. "పద చూపిస్తాను" చెల్లెల్ని తీసుకువెళ్ళి దగ్గిర కూచోపెట్టుకుని లెదర్ సూట్‌కేస్ తెరచి ఒకటొకటేతీసి ఇవతల పెట్టేడు. సున్నితమైన జపాన్ జార్జెట్ చీరలు. ప్లాస్టిక్ పీసెస్. రాళ్ళు పొదగిన గాజులు, ముత్యాల జూకీలు ఒకటేమిటి రకరకాల సామగ్రి ఆశ్చర్యంగా సంతోషంగా చూస్తూ. ఇంకా ఆశ తీరక పెట్టెలోకి చూసి ఇదేమిటన్నాయ్ అంటూ పాకెట్టు ఒకటి పైకితీసింది- "అది మనకు కాదులే తీయబోకు" వారించబోయాడు మధు. వద్దన్నదే కావాలన్న పట్టుదలతో పాకెట్ "విప్పింది" అరచెయ్యంత వెడల్పుతో హంసలు బారు జరీ బార్డరున్న గ్రీన్ పట్టుచీరె మిలమిలా మెరుస్తూ చేతిలోంచి జారిపోయేంత మృదువుగా వున్నది.

"అమ్మో ఇదెంతబావున్నదో ఇదెవరికి అన్నాయ్" కుతూహలంగా అడిగింది.

"వద్దంటే తీసేవు! నేను చెప్పను" అన్నాడు మధు చిరుకోపంతో.

"అయితే నేనే తీసుకుంటాను" పెంకెగా అన్నది.

"చిన్నప్పటి మంకుతనం నీకు పోలేదు సుభా" అంటూ చెల్లెలి నెత్తిమీద మృదువుగా మొట్టి ఎవరికీ చెప్పవుగా మరి! ఇది ఇది తాయిలంగారికి" చెల్లెలి చెవిలో రహస్యంగా పూని మొహంపక్కకి తిప్పుకుని నవ్వుకున్నాడు. అతడిమాట వింటూనే సుభద్రమొహం కళావిహీనమైంది. అది కప్పిపుచ్చుకుంటూ ఇవన్నీ అమ్మకు చూపిస్తాను

# సాఫల్యం

అన్నాయ్" అంటూ అక్కడనుండి లేచివెళ్ళింది సుభద్ర.

మధ్యాహ్నం భోజనాలు అయినాక తండ్రి దగ్గిర కాస్సేపు కూర్చుని మాట్లాడి లేచి—గంటసేపు అద్దంముందు నిల్చుని ముస్తాబై, వంటఇల్లు సర్దుకుంటున్న తల్లిదగ్గరకువచ్చి "అమ్మా రాజయ్య మామయ్యగారి ఇంటికి వెళ్ళివస్తానమ్మా" అన్నాడు మధు.

"ఇదేమిటి? ఇంత ఎండలో ఇప్పుడెందుకు? ప్రయాణంచేసి వచ్చావు కాసేపు నడుం వాల్చకూడదా?" తల్లి వారించబోయింది.

"ఇప్పుడే వచ్చేస్తానులే తల్లిమాటకి ఎదురు చూడకుండానే వాకిట్లోకి నడిచాడు.

వీధి అరుగుమీద గాలి పడగ కట్టుకుంటున్న పదేళ్ళఅబ్బాయి మధునిచూసి గుర్తుపట్టి ఇంట్లోకి పరుగెత్తి "అక్కయ్యా మధు బావ వచ్చేడేవ్" అనిచెప్పి అంతవేగంగాను మళ్ళీ అరుగుమీదకి వచ్చాడు. "ఏమోయ్ రవి నేనుగుర్తున్నానా? మీ అమ్మగారు ఇంట్లో వున్నారా అడుగుతూ లోపలికివచ్చేడు మధు. అమ్మ తాతగారింటికి వెళ్ళింది. అక్కయ్య లోపఉన్నది చెప్పితనపనిలోమునిగిపోయాడాఅబ్బాయి. గదిలో మంచంమీద పడుకుని నవలేదో చదువుతున్న శ్యామల- మధు వచ్చేడని వింటూనే అదిరిపడి లేచింది. ఎలా? ఇప్పుడెలా? ఈ పరిస్థితి ఎదుర్కోటం సాధ్యమా? గుండె శరవేగంగా స్పందిస్తుంటే అరచేత్తో అదుముకుంటూ స్తబ్దురాలై నిలబడిపోయింది.

హుషారుగా ఈలవేసుకుంటూ గదిలోకి వచ్చిన మధు

"శ్యామా- వచ్చేశాను శ్యామా! నీకోసం కాలాన్ని, దూరాన్ని జయించి వచ్చేశాను. ఇకనైనా అనుగ్రహించు దేవీ! వుద్వేగంగా రెండు చేతులూ చాపాడు.

ఆమె ఒక అడుగు వెనక్కువేసి రెండుచేతులు జోడించింది.

"ఏమిటది! ఏమిటి శ్యామా?" ఆదుర్దాగా ముందుకు రాబోయినవాడు ఆమె పల్చని పైటలో తళతళ మెరుస్తున్న మంగళ సూత్రాలు చూస్తూనే దెబ్బతిన్నట్లు ఆగిపోయి అప్రతిభుడైపోయి అనిమేషదృక్కుల్తో అలాగే పిచ్చిగాచూసి అచేతనంగా స్పృహ కోల్పోయినట్లే కుర్చీలో కూలిపోయాడు. ఇద్దరిమధ్యా అలుముకున్న నిశ్శబ్దతలో కాలమే స్తంభించిపోయింది. ఒకింతసేపటికి ఎలాగో తేరుకున్న శ్యామల మెల్లగా కనురెప్పలెత్తి "మధుబాబూ" రుద్ధమైన కంఠంతో ఏమో చెప్పాలని ప్రయత్నించింది.

"వద్దు ఏమీ చెప్పద్దు నేనేమి వినే స్థితిలోలేను" అన్నట్లు చేత్తోనే వారించినమధు తలైనా ఎత్తకుండానే భారమైన అడుగుల్తో వున్మాదిలాగా. కలలో నడుస్తున్నట్లుగా తూలుతూ వెళ్ళిపోయాడు.

అతణ్ణి వారించేశక్తిలేని శ్యామలకళ్ళు శ్రావణ మేఘాలుగా వర్షిస్తుంటే నిరూరాహ అయి అలాగే నిలబడిపోయింది.

ఆమె కన్నీటి ప్రవంతిలో గతమంతా సుడులు- సుడులుగా గిర్రున తిరగసాగింది.

* * *

తాసిల్దారుగిరీ చేసి రిటైరుఅయిన తన తండ్రి రాజయ్యగారు, స్వంత భూములున్న రామవరంవచ్చి స్థిరపడిన కొత్తరోజులు— అప్పుడు తనకు పదేళ్ళు వుంటాయేమో. ఒకనాడు పొద్దున్న తనకు తలంటుపోసి కొత్త పరికిణా, జాకెట్టువేసి "ఇవాళ శ్రావణ శుక్రవారం లక్ష్మీపూజ చేయాలి— రమణమ్మగారి దొడ్లో చాలా పూలున్నాయిట! పూజకు కాసిని పూలు తీసుకు రామ్మా" అని అమ్మ చెప్పితే పూలసజ్జ తీసుకుని రమణమ్మగారి ఇంటికి వెళ్ళింది తను. వారింటికి వెళ్ళటం అదే మొదటిసారి కాబట్టి లోపలకువెళ్ళ అడగటానికి బిడియపడి అక్కడున్న తోట మాలినే అడిగింది పూలు కావాలని, "శుక్రవారం గదండీ అమ్మాయిగారూ ఎవరొచ్చినా పూలు ఇవ్వమని అమ్మగారు చెప్పేరు- మీకు కావాల్సినన్ని కోసుకోండి" అని వాడు అనటంతో. దొడ్డంతా అరవిచ్చిన పూలవంక ఆశ్చర్యంగా చూస్తూ. ఆకులు కనపడకుండా విరగబూసిన తెల్లగులాబీ మొక్కదగ్గిరకువచ్చి నిలబడింది. అంతలోకే ఒకబ్బాయి ఇంట్లోంచి పరుగునవచ్చి రింగు రింగుల క్రాపు మొహాన పడుతుంటే ఎడం చేత్తో పైకి తోచుకుంటూ "ఏయ్ పిల్లా! ఎవరు నువ్వు? ఈ పూలు ఎవ్వరూ కోయకూడదు. పూలతో మా అమ్మ రోజూ గౌరీదేవి పూజ చేస్తుంది" అన్నాడు. తనకు వుక్రోషం వచ్చింది. తనకన్నా మహావుంటే రెండేళ్లు పెద్దేమో- అంత మాత్రానికే పెద్ద ఇదిగా అధికారం చూపుతూ తనో చిన్న పిల్లన్నట్లు నిర్లక్ష్యంగా చూస్తాడేం? అతడు మాటలు లెక్కచేయకుండా ఒక పువ్వు కోసింది.

"చెప్తుంటే నీక్కాదూ?" చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు, తనకు కోపంవచ్చి చెయ్యి విసిరికొట్టింది. ఆ పూవుకు అతడిచెయి గులాబీ చెట్టుకి కొట్టుకుని రక్తం చిమ్మింది. "అబ్బా" అని అతనుచెయ్యి వూదుకుంటూవుంటే తనుకు భయంవేసి కోసినపూలు అక్కడే పారేసి పరిగెత్తి వచ్చింది. ఆ తరువాత మళ్ళీ ఆ ఇంటికి ఎప్పుడూ వెళ్ళలేను.

ఒకసారి పేరంటంలో కల్సుకున్న రమణమ్మగారు, తన తల్లి శారదాంబ మాటల సందర్భంలో పుట్టు పూర్వోత్తరాలన్నీ తిరగేసి మరుగున పడిపోయిన చుట్టరికాలు పైకిలాగి వదినగారూ- వదినగారూ అంటూ వరసలు కలుపుకుని రాకపోకలు సాగించేరు రమణమ్మగారి అబ్బాయే మధుమూర్తి. క్రమంగా రెండు కుటుంబాల మధ్య బాంధవ్యం బలపడింది. పరంధామయ్యగారు— నాన్నగారు కూడా ఎంతో సన్నిహితంగా తిరగసాగారు. మధుచెల్లెలు సుభద్ర తనక్లాసే చదువుతూంది. ఆ అమ్మాయి కోసం వాళ్ళింటికి తరచుగా వెళ్ళేది గాని- మధుతో ఎక్కువగా మాట్లాడేదికాదు. అతడే కల్పించుకు మాట్లాడినా ఆరోజు గులాబిచెట్టుదగ్గిర సన్నివేశం గుర్తుకు వచ్చి నిర్లక్ష్యంగా జవాబుచెప్పేది.

తను పోర్తుఫామ్ చదివేప్పుడు శాబోలు— తన పుట్టినరోజు పార్టీకి తన స్నేహితులందర్నీ పిలిచింది. కావాలనే మధుని పిలవలేదు. అమ్మ కబురుచేసింది కాబోలు అతనూ వచ్చేడు- మంచులో తడిసి విరిసీవిరియని తెల్లగులాబీలు తనకు కానుకగా తెచ్చాడు. తను కళ్ళు సగం మూసి అలవోకగా నవ్వుతూ-

"ఈ పూలు గౌరీదేవి పూజకు మాత్రమే వినియోగించేనిగదా! నేను గౌరీదేవిని కాదుగా మధుబాబు అన్నది.

తన స్నేహితులంతా గొల్లున నవ్వారు. అతడెంతో చిన్నబుచ్చుకుని తలొంచుకుని నిలబడిపోయాడు. చాచినచేయి అలాగే ఉండిపోయి- ఆ కళ్ళు ఏడ్చెయ్యటానికి సిద్ధమైనాయి- ఆ కళ్ళు చూస్తేతనకు ఎంతో జాలివేసింది -పోనీతెచ్చావుగా అని చెయ్యిజాపి అందుకున్నది - అతడి కళ్ళు సంతోషంతో తళుకులీనేయి- ఆ సన్నివేశం ఇప్పటికీ తనకుగుర్తే.

తనకు తెలీకుండానే అతని పట్ల ఆత్మీయత పెరగసాగింది- ఆ పెద్దపెద్ద కళ్ళంటే తనకెంతో ఇష్టంగావుండేది. క్రమంగా ఇద్దరిమధ్యా సాన్నిహిత్యం అల్లుకుపోయింది. గులాబీ పూలతో పరిచయం మొదలై— గులాబీ పూవల్లేనే సుకుమారంగా మొగ్గతొడిగి వికసించి పరిమళించింది.

రమణమ్మగారు తనని ఎప్పుడూ "కోడలు" అనే పిల్చేది. నాన్నగారూ అంతే. మధు రెండు రోజులు తమింటికి రాకపోతే "ఏమోయ్ అల్లుడూ అప్పుడే అల్లుడిబెట్టు చూపిస్తున్నావే" అని నవ్వేవారు— పెద్దవాళ్ళ ఈ మాటలు విన్నప్పుడు— తన మనస్సులో ఏవో తియ్యటిభావం పారాడేది.

డబ్బు కావాలా!

రు. 6/-లు పెట్టుబడితో మా (చైను పద్ధతి) స్కీములో సభ్యులుగా చేరి. మీ బంధుమిత్రులను చేర్పించడం ద్వారా ఇంట్లో కూర్చుని ప్రతిరోజూ మనియార్డర్ల ద్వారా రు. 17,476/- లు లాభం పొందండి. వివరములు ఉచితము.

Sree Venkateswara Money Circulation; Govt. Regd. No-210

T. Nagar — MADRAS-17

రోజూ నిద్రలేస్తూనే పూలకోసం వాళ్ళింటికి వెళ్ళేది. తనకోసమే అన్నట్టు తోటలో పచార్లు చేస్తుండేవాడు మధు. తనని చూస్తూనే గబగబా వచ్చి చేతిలో పూలసజ్జ అందుకుని రకరకాల పూలతో నిట్టనింపి పైన తెల్లగులాబీలు పేర్చి ఇచ్చేవాడు. అవి తీసుకుని గేటుదాకా వెళ్ళి వెనక్కి తిరిగి వెక్కిరించేది. "ఏయ్ అల్లరిపిల్లా రేపొచ్చావంటే ఒక్క పూవైనా ఇవ్వను" బెదిరించేవాడు. తను పకపకా నవ్వి పరుగుతీసేది. మళ్ళీ తెల్లవారుతూనే పూలకోసం తయారు. బాల్యమంతా అలాగే మధురంగా పరుగులెత్తింది.

తను ఎస్సెల్సీలో వున్నప్పుడు మధు పి.యు.సి చదువుకు పక్కనున్న టౌనుకు వెళ్ళేడు. అతడు వెళ్ళేరోజున —

"శ్యామూ నన్ను మర్చిపోవుకదూ!" దిగులుగా అన్నాడు.

"ఏం ఎందుకు మర్చిపోకూడదు? శుభ్రంగా మర్చిపోతాను" అన్నది అతణ్ణి వుడికిస్తూ. అంతే అతడేమీ అనకుండా తల దించుకుని వెళ్ళిపోయాడు.

ఆ తరువాతగానీ అతడు లేనివెల్తి తనకు తెల్సిరాలేదు. ఆరోజు అతణ్ణలా చిన్నబుచ్చినందుకు తరువాత ఎంతగానో బాధపడింది.

మనస్సంతా వెల్తిగా, దిగులుగా, ఏదో పోగొట్టుకున్నట్లు వుండేది. చదువు మీదా— దేనిమీద దృష్టినిల్చేదికాదు. పదిమంది స్నేహితుల పక్కనజేరి కబుర్లుచెప్తున్నా ఒంటరిగా ఫీలయేది. ఆ రోజు "మర్చిపోవుకదూ" అని దిగులుగా అడిగే మధు రూపమే గుర్తుకువచ్చి— ఒక్కసారి మధుని చూడాలన్న తపన— ఎవ్వరికీ చెప్పలేని సిగ్గు— అశాంతిగా మనస్సు కల్లోలితమై పోయేది— ఫలితం? ఆ సంవత్సరం ఫెయిల్. మధు తనని వోదార్చబోతే "నీ మూలానే నా పరీక్షపోయింది" అని కసిరికొట్టింది.

"అయిందా అమ్మాయి పని! మర్చిపోతానన్నావుగా!" అని పకాల్న నవ్వి" అంతలోనే అర్థంగాపోనిమా ఒక్కసారి పరీక్షపోతే ఇంతలా బాధపడ్తారేమిటి? సెప్టెంబరుకు వెడ్దువుగానిలే అని ఎంతో వూరట కలిగించేడు.

మధు రిజల్ట్సుకూడా వచ్చేయి. తను ఆశించిన విధంగానే క్లాస్ వచ్చింది. అతడికన్నా ఎక్కువగా తనే సంతోషించింది. అతణ్ణి తమింటికి పిల్చి పార్టీ ఇచ్చింది—

ఆవాళ సాయంత్రం ఇద్దరూ కాలవగట్టుకు షికారు వెళ్ళేరు.

"మధూ కష్టపడి క్లాస్ తెచ్చుకున్నావు. నాకెంతో సంతోషంగా వున్నది. మరి తరువాత ప్రోగ్రామ్ ఏమిటి?" కుతూహలంగా మధు మొహంవంక చూస్తూ అడిగింది.

"ఏమో! నేనేం ఆలోచించటంలేదు" నిర్లిప్తతగా అతని జవాబు.

"అదేమిటి? ఇంక చదవవా?" తనకెంతో ఆశ్చర్యమైంది.

"ఎందుకొచ్చిన చదువులెదూ! ఎంత చదివినా భుక్తికోసమేగా! నాన్నగారికి సాయంగా ఇక్కడే వుందామని వున్నది."

తను పెద్దగా నవ్వేసింది. "భలేవాడివి! కాడి భుజానవేసుకుని పొలం దున్నుకుంటానంటావు. ఇంతమాత్రందానికి ఈ చదువుకూడా అక్కర్లేదు. పాపం చాలా శ్రమపడిపోయావు. ఇంక విశ్రాంతి తీసుకో" హేళనగా అన్నది.

అతనేమీ అనలేదు. ఒక్కసారి కళ్ళెత్తి తనవేపుచూసి అంతలోనే తల దించేసుకున్నాడు. ఆ కళ్ళల్లో ఏదో బాధ లీలగా తొంగిచూడుతోంది. అతని వాలకం చూస్తే తనకెంతో జాలివేసింది.

"ఏం మధూ! నీకు చదువంటే భయమా" దగ్గరకు జరుగుతూ మెల్లగా అడిగింది.

"కాదు" ఎటో చూస్తూ అన్నాడు.

"మరి"

తలెత్తి సూటిగా తన కళ్ళల్లోకి చూస్తూ "నీకు అర్థంకాదు శ్యామూ" దిగులుగా అన్నాడు.

"అర్థం చేసుకుంటానుగా చెప్పవూ" లాలనగా అడిగింది.

"నిన్ను వదిలి వుండలేను శ్యామూ" అతడి కంఠంలో మృదుత్వం తొణికిసలాడింది.

తను కిలకిలా నవ్వి— "భలే! బావుంది... నీవు చదువుమానటానికి ఇదే కారణమా?"

"చెప్పానుగా నీకు అర్థంకాదని—" అతడి మాటల్లో ఎంతో బాధ.

"నీవు చదువుమానటానికి ఇదే కారణమైతే— ఇంతకన్నా అవివేకం— తెలివితక్కువ వుండబోదు. కాదు— ఎంతో చదవాలి— గొప్పవాడివి కావాలి— నీ గొప్పదనం చూసి నా కళ్ళు గర్వంతో మెరిసిపోవాలి— నీ శక్తి ఇలా వృథా అవటం నాకు ఇష్టంలేదు. మధూ నీవు మెడిసిన్ చదువు" దృఢంగా అన్నది.

"మెడిసినా! అమ్మో అయిదారు సంవత్సరాలు నీకు దూరంగావుండాలి" బెదురుగా అన్నాడు

"దూరంగా వుండటమేమిటి? శలవుల్లో వస్తూండవచ్చుగా అయినా ఒక లక్ష్యం నెరవేర్చాలనుకున్నప్పుడు కొంతబాధనుకూడా భరించక తప్పదు. అయినా అయిదు సంవత్సరాలనగా ఎంత? ఇదే గిర్రున తిరిగి వస్తాయి—మా మధు గొప్ప సర్జను అని చెప్పుకోటం నాకుగర్వంకాదూ! నాకోసమైన నీవు చదవాలి మధూ" అతడికి వుత్సాహం కలిగిస్తూ అన్నది.

"వద్దులే శ్యామూ!" నిర్లక్ష్యంగా జవాబు

ఇంతచెప్పినా అతడు వినకపోవటంతో తనకు కోపం ముంచుకు వచ్చింది" ఛీ నీవింత పిరికివాడవని నేను అనుకోలేదు. పిరికివాడిని చూసి ఆడది జాలిపడ్తుందే తప్ప ప్రేమించలేదు. తన మగవాడు వీరుడు, ధీరుడు మహోదాత్తుడు కావాలని కోరుకుంటుంది. అలాంటి మగవాణ్ణే ప్రేమిస్తుంది. ఆరాధిస్తుంది స్త్రీకి నాలుగేళ్ళు దూరంగా వుండాలని భవిష్యత్తుని పాడిచేసుకొనే నీలాంటి అవివేకికి ఏమి చెప్పినా ప్రయోజనంలేదు" తిరస్కారంగా మొహం పక్కకు తిప్పుకున్నది.

గభాల్న అతడు తనవైపు తిరిగి తనచేయి అందుకొని అతడి గుప్పిట్లో బిగించి, "శ్యామా నువ్వలా అనకు— నీకో్కోపం వస్తే నేను సహించలేను. నీకోసం ఏమైనాచేస్తాను నన్ను అసహ్యించుకోవద్దు శ్యామా" ఆవేదనాకంఠ వణుకుతోంటే విహ్వలంగా అన్నాడు.

చివరికెలాగో ఒప్పించగలిగింది. అతనికి మెడిసిన్‌లో సీటువచ్చిన రోజున తన ఆనందం వర్ణనాతీతం.

అతణ్ణి వదిలి వుండటం తనకు మాత్రం బాధగాలేదూ? అయినా అతడిలో నిగూఢమైన శక్తిని వెలికితీసి రాణింపజేయటమే తన ధ్యేయం— తనకోసం అతనేమీ పోగొట్టుకోకూడదు. అందుకే ఎంతో గుండె నిబ్బరంతో ఈ వియోగాన్ని భరిస్తోంది.

అతను మెడిసిన్ కోర్సుకు వెళ్ళేరోజున తనకి బాగా గుర్తు. చిరుచీకట్లు కమ్ముకునే వేళ— అమ్మ గుడికి వెళ్ళింది. తాను మందారచెట్టు నీడలో మంచం వాల్చుకుని పడుండి ఆకాశంలో చుక్కలు లెక్కిస్తోంది. మధు దూరంగా వెళ్ళిపోతే. ఆ రోజులు ఇలాగే లెక్కిస్తూ గడపాలికాబోలు అన్న వూహ మనస్సంతా ఆలముకుని దిగులుతో ముంచెత్తుతూంది. అలా ఏమో వూహించుకుంటూ పరధ్యానంగా వున్న తను మధు రాకను గమనించలేదు. అతను వస్తూనే తనను అమాంతం లేవనెత్తి గుండెలకు హత్తుకున్నాడు. ఎర్రపడిన కళ్ళతో వూగిపోతూన్న అతణ్ణిచూస్తే భయంవేసి అతడి చేతుల్లోనుంచి తప్పించుకుని దూరంగా జరిగింది. అతనికి కోపం వచ్చింది— "ఎందుకలా భయపడ్తావు? నేను పరాయివాణ్ణా— ఆ మాత్రం హక్కు నాకు లేదా!" మళ్ళీ చేయి పట్టుకోబోయాడు.

"కానా ఏమిటి? మనకింకా లైన్ క్లియర్ కాలేదండీ అబ్బాయిగారూ! మనమధ్య ఎర్రదీపం వెలుగుతున్నంతవరకూ నీవు పరాయివాడివే" నవ్వుతూ అన్నది.

"ఏదీ ఆ మాట మళ్ళీ అను, నేను నీకు పరాయివాణ్ణా" జుట్టుపట్టి లాగుతూ చెవి మెలిపెడ్తూ అన్నాడు.

"బాబోయ్— వదులు — వదులు ఇంకెప్పుడూ అనను లే."

"అదీ—అలా దారికి రా" వదిలేస్తూ అన్నాడు. ఆ క్షణంలో తనకెంతో సంతోషమైంది. ప్రేమించటం కన్నా— ప్రేమించబడటమే గొప్ప సంగతి. అతడి మనస్సులో తనకంత ప్రముఖ స్థానం లభించినందుకు తన అదృష్టానికి తనకే గర్వం కలిగింది.

కాస్సేపు ఏదో మాట్లాడుతూ కూర్చుని— వెళ్ళటానికి లేచాడు.

"వెళ్ళొస్తాను శ్యామూ" అతడంటూంటే ఎంత నిగ్రహించుకున్నా ఆగని కన్నీరు చెంపల మీదకు జలజలా జారింది. అతను దగ్గరగా వచ్చి రుమాలుతో కన్నీరు అద్దుతూ "ఛా... ఏమిటిది? మొత్తానికి ఆడపిల్లవనిపించేవు. నీ ధైర్యమంతా

# సాఫల్యం

ఏమైపోయింది? ఏదీ నా కళ్ళల్లోకి చూసి ఒక్కసారి నవ్వు-" చుబుకం పట్టి ఎత్తుతూ లాలనగా అన్నాడు.

తను నవ్వలేకపోయింది. 'అయితే మానేయమన్నావా? నీవు సంతోషంగా సాగనంపితే నాకు ధైర్యంగా వుంటుందిగాని, నువ్వింత బాధపడుతుంటే నేను ఒక్క అడుగైనా ముందుకు వేయగలనా? ప్చ్... ఏం చేస్తాం- డాక్టరుగారి భార్యవన్న గౌరవం పొందే అదృష్టం నీకులేదు. చిలిపిగా అతడు అంటూంటే- ఎలానో ధైర్యం తెచ్చుకుని "వు.. హూ. లేదు లేదు, నేను బాధపడను. ఏమిటో చాలా దిగులుగా అన్పించింది అంతే... శలవుల్లో తప్పక వస్తావుకదూ- దొరబాబువి అయిపోతావు- ఎందరో స్నేహితులు ఎన్నో వ్యాపకాలు- అన్నింటికన్నా మించిన చదువు బాధ్యత వీటిల్లో మునిగిపోయి- నీ చిన్ననాటి చెలిని మర్చిపోవుకదూ-" మళ్ళీ కన్నీటి కెరటం చివ్వున ఎగసిపడింది.

"ఏమిటిది? నీకు పిచ్చాఏమిటీ? మర్చిపోవటం ఏమిటీ? ఏదీ నా కళ్ళల్లోకి చూసి ఆ మాట అను. నా కళ్ళల్లో తొణుకులినే నీ రూపం ఎక్కడిదనుకున్నావు? ఈ నా గుండెల్లో రూపమే నా కళ్ళల్లో ప్రతిబింబిస్తోంది. గుండెల్లో ముద్రపడిన రూపం చెరగటం ఎప్పటికీ వుండదు. ఈ మధుగాడు వున్నాడే- వీడికి ఒక్కమాట చెప్పటం, ఒకటి చేయటం ఎప్పుడూ తెలీదు- మాటతప్పటం వీడి జన్మలోనే వుండదు. మరోసంగతి చెప్పమన్నావా? మగవాడు అసలు ప్రేమించనే- ప్రేమించడు. ప్రేమించాడో, సూర్య-చంద్రులు గతులు తప్పినా అతడి ప్రేమకు చలనం వుండదు. అదీ సంగతి- పట్టుదలగా- ఆత్మ విశ్వాసంతో అతడంటూంటే- అతనిపట్ల ఆరాధనతో తన మనస్సు పిం[illegible]. పులకితమైపోయింది- ఆ సంతోషంతో గుండె దిటవుపర్చుకుని నవ్వు తెచ్చుకుంటూ- "ఇంతగొప్ప ప్రేమను నేను భరించలేను బాబూ" అన్నది.

"అయినా నీకు తప్పదమ్మాయీ" అతను సీరియస్‌గా అంటూంటే నిజంగానే తనకు నవ్వొచ్చి పకాల్న నవ్వింది- తన నవ్వుతో అతడి నవ్వు శ్రుతికలిపి మధురంగా వినిపించింది.

మధు చదువులో ఎంతో ప్రతిభ కనపర్చి, ప్రతి సంవత్సరం ఫస్టురాంక్‌లో వుత్తీర్ణుడౌతూ అధికారుల మన్ననకు పాత్రుడై గౌరవాన్ని పొందుతూంటే- అతడుపొందే ఆ గౌరవం అంతా తనదే అన్నట్లు పొంగిపోయేది-

అయిదు సంవత్సరాలు ఇట్టేగడిచిపోయాయి- హౌస్ సర్జన్ చేస్తూ అక్కడే వుండిపోయి ఒక సంవత్సరం రాలేదు మధు- అతడు వచ్చేసరికి తను ఇక్కడలేదు. మామయ్యకూతురు పెళ్ళికి వెళ్ళి రెండు, మూడునెలలు అక్కడే వుండిపోయింది. ఆ సమయంలోనే-

"మధుకు స్టేట్స్‌కు వెళ్ళటానికి స్కాలర్‌షిప్ వచ్చిందని- అన్నయ్యకు అంతగా ఇష్టం లేదని- నిన్ను త్వరగా రమ్మంటున్నాడని" సుభద్ర తనకు వ్రాసింది.

ఇంటి ముంగిటకువచ్చి తలుపుతట్టే అదృష్టాన్ని కాలదన్నుకుంటున్న మధుమీద అంతులేని కోపం వచ్చింది అలాటి అమూల్యమైన అవకాశాన్ని వదులుకుంటున్న మధు అవివేకాన్ని హేళన చేస్తూ- రెచ్చగొడ్తూ ఏమో వ్రాసింది అతడికి. పాపం అతడే మనుకున్నాడో- తనకు చెప్పనైనా చెప్పకుండా స్టేట్స్ వెళ్ళిపోయాడు. ...

ఈరోజు తనుకోరిన విధంగా ప్రతిభావంతుడై అతడు తిరిగివస్తే... చేతులుచాచి సాదరంగా స్వాగతమిచ్చే. అదృష్టం తనకులేదు- అసలే సున్నితమైన మనస్సు అతనిది. ఈ పరిస్థితి ఎలా తట్టుకుంటాడు- మనస్సంతా అలముకున్న కోటి కోరికలతో- మధురోహలతోవచ్చి ఆపలేని అనురక్తితో చేయి చాపితే... తనేమి ఇవ్వగలిగింది- తనను ఒక్కమాటైనా అనలేదేమి? ఎందుకిలా చేశావని ఈ లెంపా ఆ లెంపా వాయిస్తే బావుండేది. ఇంత గొప్ప క్షమను తనెలా భరించగలదు! తన బాధను- నిస్సహాయ స్థితిని అతనికి చెప్పుకునే మార్గమేమిటి? చెప్పలేకపోతే తనకు ఈ జన్మలో శాంతి దొరకదు- ఏం చేయను! ఏం చేయను? భగవాన్ మా జీవితాలతో ఎందుకిల్లా చెలగాట మాడుతున్నావు! చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది శ్యామల.

* * *

"అసలేం జరిగింది సుభా" ఎర్రబడిన కళ్ళెత్తి చెల్లెలివంక చూస్తూ అడిగేడు మధు...

"ఏం వున్నది! మనుకాలాలు నిల్చుకోటానికి ఎంతో శ్రమించాలిగాని, తెంచుకునేందుకు క్షణం కూడా పట్టదు. ఎప్పుడూ లేనిది క్రిందటేడు సంక్రాంతికి నాన్నగారు- రాజయ్యమామయ్య సరదాకు కోళ్ళ పందేలు జరిపించేరు. అప్పుడే ఇద్దరిమధ్యా స్పర్థలు తలెత్తాయి. అవి అలాగే సమసిపోతే బావుండేవి. కాని ఎక్కడకాస్త అగ్గి రాజుకుంటుందో- అందులో కాస్త ఆజ్యం పోసి, సమిధలు వేసేవారు అంతటా వుంటారు. అలాటివారి ధర్మమా అని కోడి పందేలతో మొదలైన పట్టుదలలు, పొలంగట్ల తగాదాలుగామారి పరాకాష్ఠ అందుకున్నాయి. వూరంతా రెండు ముఠాలుగా చీలిపోయి- చెరో పార్టీకీ, నాన్నగారు, రాజయ్యగారు అధిపత్యం వహించటం- అప్పుడే పంచాయతీ ఎన్నికలు కూడా సంప్రాప్తమైనాయి- ఎప్పటినుంచో ఎదురు లేకుండా ప్రెసిడెంటు గిరి చెలాయిస్తున్న నాన్నగారికి ప్రత్యర్థిగా రాజయ్యగారు నిలబడ్డారు. నిప్పు లేకుండానే వాతావరణం మండిపోసాగింది. గాలి దుమారంలాటి ఎన్నికల ప్రచారంలో ఎందరో అమాయకులు చావు దెబ్బలుతిని హాస్పిటల్ పాలైపోయారు. వాన నీరులాగ డబ్బు ప్రవహించింది. కల్లు ముంతలతోను- కరెన్సీ నోట్లతోను ఓట్లన్నీ రాజయ్యగారు కొనేశారన్న ప్రవాదు చెలరేగింది. ఏమైతేనేం నాన్నకు డిపాజిట్టుకూడా దొరకలేదు. నాన్న పౌరుషం తెల్సుగా! ఎన్నికల ఫలితాలు తెల్సిన ఆ రాత్రే రాజయ్యగారి పసువుల కొట్టం- కొండలలాటి గడ్డివాములు తగలబడిపోయాయి- వారం తిరక్కుండా వడ్ల పురులన్నీ అగ్నికి ఆహుతి అయిపోయాయి- దాంతో ఇద్దరు ఒకరిమీద ఒకరు కేసులు బనాయించుకుని కోర్టులకెక్కటం ఫలితం సర్వ నాశనం. బావా బావా అని బుజాలు రాచుకుంటూ తిరిగే వాళ్లు, ఎదురైతే తుపుక్కున వుమ్మేసి పక్కకి తిరిగిపోయేంత బద్ధ శత్రువులైపోయారు. అప్పటికీ కళ్ళు చల్లపడని జంబుకాలు కొందరు ఏమండీ రాజయ్యగారు అయిందేమో అయింది ఇంకనైనా పరంధామయ్యగారితో రాజీ పడండీ, రేపు వారబ్బాయి ఫారెన్ నుండి వస్తే కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యరూ. అని రెచ్చకొట్టడం "ఆ అప్రాచ్యుడి కొడుక్కి నా కూతుర్ని ఇచ్చేకన్నా గొంతు పిసికి ఏట్లో పారెయ్యటం నయం" అని ఆయన మండిపడటం-

"ఆ ఏగుల్బాజీ కూతుర్ని నా కొడుక్కి చేసుకుంటాననుకుంటున్నాడేమో- వాడు కుక్కలాగా నా వాకిట్లో పడిగాపులు పడి అర్థించినా చేసుకోను, వాడి కూతురు నా ఇంట్లో అడుగు పెడ్తే కొంపకు నిప్పెడ్తాను" అని పరంధామయ్యగారు మరింతగా ఆవేశాలు పెంచుకున్నారు. రాజయ్యగారికి పట్టుదల పెరిగి ఆ రాఘవుల కొడుక్కి శ్యామలను కట్టబెట్టి ఇల్లరికం తెచ్చుకున్నాడు."

"శ్యామల ఒప్పుకున్నదా" పళ్ళుకొరుకుతూ కోపంతో వూగిపోతూ అన్నాడు మధు.

"ఏమో! చండశాసనుడైన రాజయ్యగారికి ఎదురుచెప్పే గుండె ఎవరికి వున్నది! దేవతలాటి శ్యామల- కన్నెత్తి ఒకరిని చూడలేదుట- పెళ్ళయిన ఆరోజునుండి వీధిమొగం చూసి ఎరగదు. పాపం ఆమె మనసులో ఎంత వేదన వున్నదో జాలిగా అన్నది సుభద్ర.

"ఇవంతా నువ్వెందుకు నాకు రాయలేదు.?"

"నేను వ్రాద్దామనే అనుకున్నాను, కానీ- ఇక్కడి సమాచారం ఒక్కటికూడా నీకు తెలియపర్చవద్దని శ్యామల అన్నది. ఇవంతా మనం అనుభవించేది చాలదా? ఎక్కడోవున్న అతణ్ని బాధపెట్టడం ఎందుకు! అతడి మనశ్శాంతి పోగొట్టటం తప్ప ప్రయోజనం ఏమీ వుండదు ఆనేది! తనకు తెలీకుండా రాస్తానేమోనని రాయనని నామీద ఒట్టుపెట్టించి నాదగ్గర వాగ్దానంకూడా తీసుకున్నది, నువ్వేవిధంగానూ బాధపడకూడదని శ్యామల పట్టుదల- నేను ఏమీచేయలేని నిస్సహాయురాల్ని అయాను" అన్నవంక క్షమార్పణగా చూస్తూ అన్నది సుభద్ర.

"ఏడవలేకపోయావు" చెల్లెల్ని కసిరి దిండ్లలో మొహం దాచుకున్నాడు మధు.

* * *

మూడురోజుల్నుండి వొళ్లు తెలీని జ్వరంలో పడివున్న శ్యామల అలాగే కాస్త సులువుగావుండి కిటికీదగ్గరగా వాలుకుర్చీ వేసుకు కూర్చున్నది.

అప్పుడే చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయి- నీరసంగా కళ్లుమూసుకుని వెనక్కివాలిన శ్యామల- శ్యామా శ్యామా అని మెల్లగా ఎవరో పిలుస్తున్నట్లయి వులిక్కిపడి కళ్లుతెరచి చూసింది కిటికీకి కొంచెందూరంలో రోడ్డుమీద నిల్చున్న సుభద్ర రమ్మని చేయివూపుతోంది. చప్పుడు కాకుండా వాకిలితలుపు తీసుకుని సుభద్ర దగ్గరకు నడిచి ఏమిటన్నట్లు చూసింది. శ్యామల భుజాలు పట్టి నొక్కుతూ శ్యామా నువ్వొక్క సహాయం చేయాలి చేస్తావుకదూ? మా అన్నయ్య పరిస్థితి ఏమీ బాగుండలేదు. అన్నం నీళ్లు లేకుండా ఒకటే కుమిలిపోతూ బాధపడుతున్నాడు. ఎవ్వరినీ దగ్గరకు రానియ్యడు. మతి స్థిమితం తప్పిందో ఏమోనని మాకు భయంగా వున్నది. శ్యామా నువ్వు చెప్పితే మా అన్నయ్య వింటాడు. ఒక్కసారి మా ఇంటికి రావూ... నీకు ఎప్పటికీ ఋణపడివుంటాము. జాలిగా కన్నీళ్ళతో ప్రాధేయపడుతున్న సుభద్ర వంక ఒక్కసారి చూసి పద అంటూ ముందుకు సాగింది. ఇంటికి చేరేక నాన్నగారు హాల్లో వున్నారు నువ్విలా దొడ్డివేపు మెట్లమీదనుండి పైకివెళు అన్నయ్య పైన వున్నాడు. అని శ్యామలను దొడ్డివేపు మెట్లదగ్గిర వదలి తను ఇంట్లోకి వెళ్ళింది సుభద్ర.

వణికే కాళ్ళతో అదిరే గుండెతో ఎలాగో మెట్లుఎక్కి వెళ్ళగలిగింది శ్యామల. మధు కిటికీ వైపు తిరిగి ఎటో శూన్యంలోకి చూస్తున్నాడు. దగాపడిన మనస్సులాగా చేతిలో సిగరెట్టు కాలుతోంది. ఆ సమున్నతమైన విగ్రహాన్ని చూస్తూనే చలించిపోయింది. గుండె దిటవుపర్చుకుని ముందుకువెళ్ళింది. మెల్లిగా సవ్వడి చేసినా అతను వెనుదిరగలేదు. ఎలాగో గొంతు పెగల్చుకుని "మధూ' మృదువుగా పిల్చింది. పరిచితమైన కంఠం వింటూనే చివ్వున వెనక్కు తిరిగేడు. విభ్రాంతితో అతడి కళ్ళు విశాలమైనాయి. అలాగే కళ్ళార్పకుండా చూస్తూ నిలబడిపోయాడు. ఏమనాలో ఆమెకీ తోచలేదు చివరికి సంబాళించుకుని. 'ఏమిటి మధూ ఇలా వున్నావు' అది అసందర్భమైన మాటే అని తెల్సినా ఏమీ తెలీని స్థితిలో ఏదో అనేసింది. ఆమాట వింటూనే-దెబ్బతిన్న పులిలాగ గాండ్రించాడు. "ఇంకెలా వుంటాననుకున్నావు? ఇలా అయిపోవాలనేగా నీకోరిక- నీ కోరిక తీరిందిగా. చూసి బాగా సంతోషించు అసలెందుకేగా నువ్వు వచ్చింది. నిజంచెప్పు శ్యామా! ఇప్పుడెందుకు వచ్చావు? నా ఏడుపు చూసి సంతోషించటానికి కదూ" ఆ కంఠంలో క్రోధం చిందులు తొక్కుతోంది.

'అవును అందుకే వచ్చాను. నీవెంతో చదువుకున్నవాడివి- విజ్ఞానవంతుడివి- నీకు నేనుచెప్ప గలిగేదాన్ని కాదు.-కానీ-కానీ-మధూ పరిస్థితుల్ని ఎదిరించి నిలవాలేగానీ. బేలగా ఎడ్చి కృంగిపోతే లాభమేమిటి'?,

"పరిస్థితులా? దీనికి నీవేగా కారణం. మొదట్నుంచీ నేనంటే నీకు అలుస భావమే. ఆ సంగతి తెలిసీ నేనే పిచ్చిగా మమత పెంచుకున్నాను. నీపరదా కోసం నా మనసుతో ఆడుకున్నావు- సరదా తీరాక విదిలించిపారేశావు. లేకపోతే ఏమాత్రం మమతా-మనసూ వున్నా నాకు తెలియచేసేదానివి. నేనుపరుగెత్తుకువచ్చి కుక్కలాగ పోట్లాడి నిన్నుదక్కించుకునేవాణ్ణి"


"అవును నీవంతటి వాడివే. అందుకే తెలీనివ్వలేదు. ఇందులో నా స్వార్థం ఏమీలేదు అంతా నీకోసమే. అర్థంచేసుకో మధూ." ఆమెగొంతు దుఃఖంతో పూడిపోయింది.

"ఇంకా ఇలాటి తీపి కబుర్లు చెప్పి ఎందుకు వంచిస్తావు శ్యామా. ఆనాడు ఇలాటి కబుర్లుచెప్పే దూరంగా పంపేవు-ఏ వ్యక్తి కోసం నేనింత కష్టపడ్డానో, ఎవరిముఖాన చిరునవ్వు చిందులాడితే- పండుగగా భావించానో అదంతా ఇప్పుడు వృథా అయిపోయింది. ఈ డిగ్రీలు ఈహోదా ఇంకఎవరి కోసం శ్యామా నీతండ్రి పరువుప్రతిష్ఠలునీసుఖం! నీవుచేసుకున్నవేగాని ఇసుమంతైనా గురించెప్పుడైనా నీకు జాలిఅయినా లేకపోయిందా. చిన్నతనం నుండి మనసులో మనస్సై ఒక్కటిగా పెరిగేమే. ఇంత తేలిగ్గా ఎలా ఈ అనుబంధం తెంచగలిగావు నీకు నేను తగను అనుకున్నావా? నిన్ను సుఖపెట్టలేననుకున్నావా, నీవుతప్ప నాకు బ్రతుకే లేదను కున్నాను, నాసుఖ సంతోషాలన్నీ నీతోనే పెనవేసుకున్నాయనుకున్నాను, ఎందుకు శ్యామా ఎందుకింత పనిచేశావు మాటమాత్రం నాకు చెప్పక పోతివి కనీసం స్నేహధర్మాన్నైనా పాటించక పోతివి' అతడికళ్ళు అశ్రుపూరితమైనాయి.

"నిజమే మధూ నీకు తెలియజేయకపోవటం తప్పే. అందుకు ఏ శిక్ష విధించినా భరిస్తాను కానీ నీకు తెలిస్తే జరిగేదేమిటి? నీవు వస్తావు! కార్పణ్యంతో కూలిపోయిన ఈ రెండు కుటుంబాలు చేరువకు రావటం అసంభవం. పగవాడి కూతుర్ని కోడలుగా స్వీకరించే వుదాత్త హృదయం మీ నాన్నకు లేదు-నీవు మొండిపట్టుదలకు దిగితే ఫలితం? నీవు ఆ ఇంటినుండి బయటకు నడవాల్సి వుంటుంది."

"అయితేకావచ్చు. నాకు కావల్సింది నీవుగాని వేరెవ్వరితో ఏపరిస్థితులలోను నాకు నిమిత్తంలేదు చూడు ఈ గుండెల్లో నిన్న దేవిస్వరూపంగా నిల్పుకొని ఆరాధించాను ప్రేమించాను నీకోసం నా మనసు-తనువు అతి పవిత్రంగా కాపాడుకున్నాను. ఏ బలహీనక్షణం నన్ను లొంగదీయలేదు, చివరికి అంతా... అంతా వ్యర్థమై పోయింది. శ్యామా......ఈ గుండెల్లో నీవుచేసిన గాయం ఎంత రుధిర స్రవంతి అయిందో చూడు! అబ్బా...ఈ బాధతో నేను బ్రతకలేను నీచేత్తో ఇంత విషమిచ్చేయి. ప్రేమించినవాడి గతి ఇంతే అనుకుంటూ కళ్లు మూస్తాను" బాధతో గుండెల్ని అదుముకుంటూ వెనక్కు వాలిపోయాడు.

"మధూ...మధూ ఎందుకింత పిచ్చివాడివై పోతావు' కళ్లుతెరిచి పరిస్థితుల్ని అర్థం చేసుకోవేం? నీ సంగతేగానీ - నీ తల్లి, దండ్రుల్ని గురించి ఆలోచించవేం? అధికారాలు-ఆస్తులు సర్వమూ కోల్పోయిన నీ తండ్రికి మిగిలింది నీ వొక్కడివే - నీమీద కొండంత ఆశపెట్టుకున్న నీ వాళ్ళకు నీవు చూపించే కృతజ్ఞత ఇదేనా - ఒక్కగా నొక్క కొడుకువి. నీ తలి, దండ్రుల్ని సుఖపెట్టేబాధ్యత నీది కాదూ, ఎవరి డబ్బుతో నీ వింతటి వాడివయావో వాళ్ళని కాలదన్ని - నీ సుఖం నీవు చూసుకునేంత స్వార్థపరుడివా నువ్వు చెప్పు మధూ! పెద్దల ఆశీర్వచనంలేని బ్రతుకులు ఎప్పుడూ సుఖపడవు. ప్రేమనే నిషాలో కళ్లు మూసుకుపోయినప్పుడు ఏవీ కనపడవు. ఏవీ అడ్డురావు. ఆ కైపు దిగిపోయాక? నీ వాళ్ళనుండి నువ్వు దూరం కావటానికి నేనే కారణమని నీవు అనుకుంటే. అప్పుడు మన బ్రతుకులు నరకం కన్నా హీనమైపోతాయి. అలాటి హేయమైన



# సాఫల్యం

పరిస్థితుల్లోకి నిన్ను లాగేంత నీచురాల్ని కాలేక పోయాను"

"ఓహో, త్యాగమంతురాలివన్న కీర్తి కోసమా! అలాటి తప్పుత్యాగం నాకు చాతకాదు. నీవంటే ఇంత సులభంగా త్రోసిపుచ్చావుగాని నాకు అది చాతకాదు – నాలో ప్రత్యణువూ నీవే నిండిపోయి, నా హృదయ స్పందనలో నీవే ప్రతిధ్వనిస్తూంటే నా బ్రతుకే నీకోస మనుకున్నాను. నా ప్రాణంలో ప్రాణమైన నీవే నన్ను ఇంత వంచనచేశాక, ఇంక ప్రపంచమంతా దగా – మోసంగానే కన్పిస్తోంది. సర్వమూ కోల్పోయిన దరిద్రుణ్ణి – నా బ్రతుకే వృథా అయింది. నాకు కావాల్సింది నేను పొందలేక – ఎవరికోసమో బ్రతకటం నా వల్లకాదు." అతడి గొంతులో బాధ, కఠినత్వం గురగుర లాడింది.

"ఎంతమాత్రం అలా అనుకోరాదు. మన బలహీనతలకొద్దీ అనేకమైన కోరికల్ని కోరుకుంటాము. అన్నీ తీరితే మానవులంకాక దేవతలమే అయిపోయేవాళ్ళం – ప్రేమ ఒక్కటే జీవిత ధ్యేయంకాదు కాకూడదు. ఒక్కసారి కళ్ళెత్తి నీ చుట్టూ చూడు, అజ్ఞానంలో – అనారోగ్యాలతో అలమటించే ఈ పేద ప్రజానీకాన్ని చూస్తే నీకు జాలికలగటంలేదూ? మధూ! ఇక్కడ నీవు ప్రాక్టీసు పెట్టు – ఇటువంటి వారికోసమే నీ జీవితాన్ని అంకితంచేయి – భగవంతుడూ మెచ్చుతాడు...కేవలం అల్పమైన లాలసత్వం కోసం జీవితం భగ్నంచేసుకోటం విజ్ఞతా లక్షణం కాదు – దురదృష్టమైన ఈ బ్రతుకుల్లో శాంతినే వెదుక్కుందాము –" ఆమెగొంతు జీరబోయింది.

"శాంతిట! శాంతి, జీవితం మొదట్లోనే ఇంత పరాజయం పొందిన నాకు ఇంక సుఖశాంతు లేమిటి? ఇంకీ పరువు ప్రతిష్ఠలు– గొప్పదనాలు ఇవేమీ నాకువద్దు. అసలే ఏడుస్తున్న నన్ను ఇంకా ఎందుకు వేధిస్తావు నీకు పుణ్యం వుంటుంది. ఇలాటివేవీ నాకుచెప్పకు. నువ్వు దూరమైనప్పుడే అన్నీ నాకుండి దూరమై పోయాయి. మిగిలింది ఒక్కటే. అంతులేనిబాధ" కిటికీ చువ్వలకు నుదురు రాచుకుంటూ అన్నాడు.

"ఛా...ఏమిటి మధూ నీవు మగవాడివి కాదూ! నీలో ధైర్యంలేదూ హరుని కంఠంలో హాలాహలంలాగా ఈ ప్రేమను గుండెల్లోనే దాచుకుని, పరిస్థితుల్ని జయించి ధీరత్వంగా నిలవాలి జీవితమే ఒక సంగ్రామం. గెలుపు ఓటములు దైవాధీనం. తుదిదాకా నిలచి పోరాడటమే మన విధి. భయపడి పారిపోయేవాళ్ళను లోకం ఎన్నటికీ క్షమించలేదు. ఈ సంగతి తెల్సుకున్నవారే మహా మనీషు లౌతారు. నీ వంటి వాడివి కావాలి. నీ కోసం కాకపోయినా నీ త్యాగఫలకోసమైనా నీ జీవితం సుఖప్రదం కావాలి – నీవు పెండ్లి చేసుకుని అన్నివిధాల సుఖపడ్తూంటే"... ఆమె మాట పూర్తి కాకుండానే అతను చివాల్న వెనక్కు తిరిగాడు అతడి బలమైన చేతుల్లో ఆమె భుజాలు బిగుసుకున్నాయి – జ్వలించే కళ్ళతో దహించేట్లు చూస్తూ – ఏమిటి ఏమన్నావు శ్యామా! నేను పెండ్లి చేసుకోవాలా? నీకు సిగ్గెలా లేకపోయింది. ఆ మాట అనటానికి – మానసికంగా మనకేనాడో పెండ్లి జరిగింది. నువ్వు నన్నింత సుఖపెట్టేవు? ఇంక మరో ఆశ! ఛీ .. ఆశదానివి, నమ్ముకున్నవాడు ఎక్కడా ఎప్పుడూ సుఖపడలేడు. నువ్వు నాపాలిట పిశాచానివి. నా బ్రతుకు అన్నివిధాల నాశనంచేశావు? వెళ్ళిపో... ఇక్కడినుంచి వెళ్ళిపో...విసురుగా తోశాడు. ఆ వూపుకి ఆమె మంచంమీద పడిపోయింది. మంచం కోడు నుదురుకు కొట్టుకుని రక్తం చిమ్మింది. అతడు గభాల్నవంగి ఆమెని వడిలోకి తీసుకుని ..శ్యామా – నేనెంత పాపిష్టివాడిని నిన్నెంత బాధపెట్టాను. ఎందుకు నన్నింత రెచ్చగొట్టేవు శ్యామా? ఎప్పుడూ అలాటిమాట అనొద్దు నీవే నా దేవతవు – నీవే నాకు కావాలి. నీవులేక నేను బ్రతకలేను – ఈ పాలుగారే చెక్కిళ్ళు గులాబీ రేకుల్లాటి పెదవులు – అనురాగం పెల్లుబికే ఈ వక్షం, ఇవన్నీ నావి మాత్రమే కావాలి. మరో మగాడి చేతుల్లో నిన్ను వూహించుకుంటే పిచ్చివాణ్ణి అయిపోతాను. అసూయను – ఈర్ష్య అను – స్వార్థపరుణ్ణి అను ఏమన్నాసరే నీవు నాకు దక్కితేచాలు – ఎన్నో విషయాల్లో నేను నీమాట విన్నాను. ఈ ఒక్క విషయంలో నువ్వు నామాట వింటావుకదూ! శ్యామా... నా బంగారువి కదూ. ఈ ఒక్కసారి నామాట వినమ్మా! మనిద్దరం కల్సి ఎక్కడైనా వెళ్ళిపోదాం. ఈ పరువు ప్రతిష్ఠలు – సాంఘిక విలువలు ఇవేమీ మనకు వద్దు. నువ్వు నాకు, నేనునీకువుంటేచాలు. ఇంకేమి వద్దు ఒక్కసారి వూ... అను శ్యామా, ఆవేశంగా ఆమె ముఖమంతా ముద్దులతో నింపేశు. ఆమె పెదవులు చిట్లి రక్తం చిమ్ముతున్నా అతడికి తెలీటంలేదు.

అతడి ఒడిలో పై మరచి ఒరిగిపోయిన శ్యామల అరమోడ్పుగా కళ్ళెత్తి అతని చేతుల్ని చెంపలకదుముకుంటూ... "మధూ. .. నాజీవితం ధన్యమైంది. ఇంతకాలం ఇందుకోసమే బ్రతికేను. ఇంక ఈ జన్మకు ఇదిచాలు. మెల్లిగా గొణిగింది. ఏమిటి శ్యామా! ఏమంటున్నావు? నువ్వొప్పుకున్నావుకదూ – నిజంగా ఒప్పుకున్నావుకదూ– ఇప్పుడే ఇప్పుడే వెళ్ళిపోదాం' సంతోషంగా ఆమెని గుండెలకి హత్తుకుని వుక్కిరి బిక్కిరి చేశాడు.

ఇప్పుడుకాదు, రేపు,రేపు ఇదేవేళకు వస్తాను. అంటూ అతడి చేతుల్ని వదిలించుకుని అవిరళంగాజాలువారే అశ్రువుల్తో గబగబ మెట్లుదిగి వెళ్ళిపోయింది.

* *

మరునాడు సాయంత్రం దీపాల వేళ—

అద్భుతంగా జగదేకసుందరిలాగాఅలంకరించుకుని మధుగదిలో అడుగుపెట్టింది శ్యామల, ఆమె కోసమే ఆత్రంగా ఎదురు చూస్తున్న మధు ఆనందంగా చేతులుజాపి ముందుకు వచ్చి–"హమ్మయ్య వచ్చేశావుగదా! రావేమోనని ఎంత భయపడ్డానని. ఆమె భుజాల చుట్టూ చేతులువేస్తూ అన్నాడు.

"అవును వచ్చేశాను, శాశ్వతంగా నీదాన్ని అయేందుకు వచ్చేశాను" అతడి చేతులు తప్పించుకుని కుర్చీలో కూర్చుంటూ అన్నది ఆమె.

"అబ్బ నాకెంత సంతోషంగా వుందనీ– ఈ రోజు నాకు ఎంత అపూర్వమయిన రోజు"

"ఇదా అదృష్టం? ఈ పని ఏం బాగున్నది మధూ" ఆమె కంఠంలో బాధ తొణికిసలాడింది.

"చిన్నతనం నుండి మనలో ఆశలు పెంచుకునేందుకు దోహదం చేసి– చివరికి వాళ్ళ స్వార్థంకోసం మన మనసున పెనవేసుకున్న అనురాగాన్ని తెంచి వేసేందుకు సిద్ధపడే ఇలాటి పెద్దవాళ్ళకు ఇల్లాగనే బుద్ధి చెప్పాలి– అమూల్యమైన జీవితాలతో చెలగాటమాడే పెద్దల్ని ఇంతకన్నా గౌరవించ నక్కర్లేదు. నిజంగా ఇప్పుడు నాకు చాలా సంతోషంగా వున్నది ఇంట్లో ఎవరూ లేరుకూడా. గుళ్ళో పూజలు చేయించటానికి అందరూ వెళ్ళేరు– చక్కని అవకాశం, అయిదు నిమిషాల్లో బయట పడిపోదాం?" అతను వుత్సాహంగా చెప్పుకు పోతున్నాడు.

"చివరికి ఇదా నీ గొప్పతనం– ఇంతచదువుకుని నీవు నేర్చుకున్నది ఇదన్నమాట" దిగులుగా అన్నది ఆమె.

"నాయీ గొప్పతనానికి పునాది వేసింది నీవేనని మర్చిపోకు"

"నాకుతెల్సును, అందుకే నాకు నేను ఎంతో నచ్చచెప్పుకుని ఇలా రాగలిగేను,"

ఆ మాట తడబడింది. ఆవైపుకు తిరిగి సూట్‌కేసు సర్దుతూ అతడు గమనించలేదు–

"పాపం చాలా శ్రమపడ్డావు ఇంక నీ కే మీ కష్టం కలిగించను, హృదయ సింహాసనం మీద మహారాణిలాగా ప్రతిష్ఠించుకుని సేవ చేస్తా డీ భృత్యుడు"

ఆమె మాట్లాడలేదు. "ఏం మాట్లవవు కోపం వచ్చిందా మహారాణీ– అలక బూనటానికి అనురాగం కురిపించటానికి ఇంకా బోలెడు కాలం వున్నది– ఏదీ ఇటొచ్చి కాస్త హెల్ప్ చేయి–"

అప్పటికీ ఆమెనుండి జవాబు లేదు. ఆశ్చర్యంగా వెనక్కుతిరిగి చూశాడు. ఆమె కుర్చీలో ఒక పక్కకు వొంగిపోయింది, పెదాలు నల్లబడిపోయి కళ్ళల్లో కాంతి తరిగిపోతూంది."ఏమిటి శ్యామా ఏమైంది" గభాల్న లేచివచ్చి ఆమెని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె బలవంతాన కళ్లువిప్పి ఏమో చెప్పాలనిప్రయత్నించింది. కాని పెదాలువిడలేదు. అతని చేతుల్లోంచి జారిపోయింది. మెల్లగా ఎత్తి మంచం మీద పడుకోబెట్టి. "ఏమిటి శ్యామా! ఎందుకిల్లా అయిపోయావు చెప్పు చెప్పవేం..." ఆమెని కుదుపుతూ కంగారుగా అన్నాడు. బలమంతా కూడదీసుకుని తనగుప్పెట్లో నలిగిపోయిన చిన్న కాగితం అతని చేతిలో పెట్టింది. ఏమిటిది ఆశ్చర్యంగా చేతిలో కాగితం

వంక చూసుకున్నాడు. అక్షరాల దారులవెంట అతడిచూపులు పరుగులెత్తేయి.

నా స్వామీ-

మొదటిసారిగా చివరిసారిగా నిన్ను ఇలా సంబోధిస్తున్నందుకు నాకెంతో తృప్తిగా, సంతోషంగా వున్నది. నా మనస్సువిప్పి నీ ముందు వుంచుకున్నాను ఇప్పటికయినా నన్ను అర్థంచేసుకుంటావు కదూ.

నీ వంటే నిర్లక్ష్యమనీ. అందుకే దూరమయానని ఏమో అన్నావు. కాని అది నిజంకాదు మధూ... బుద్ధి తెలిసినప్పటినుండీ నీవే నా జీవిత భాగస్వామివనీ- నీతోడిదే జీవితమనీ కలలు కన్నాను. నా మనస్సులో నీకు వున్నతమైన స్థానం ఇచ్చి ఆరాధించాను. ప్రేమించాను- కాని చివరికి నా అదృష్టం వక్రించి కలలు కల్లలై పరిస్థితులు అన్నివైపులనుండీ నన్ను బంధించి వేశాయి. నీకు దూరం కావటానికి నేనెంత క్షోభ పడ్డానో ఎలా చెప్పను? నా మనస్సుతో పాటు శరీరము నీకే కావాలని అన్నావు. ఒక్క సంగతి చెప్తే నమ్ముతావా- నా శరీరమూ మనస్సు ఎప్పటికీ నీదే- పెండ్లి జరిగినా ఇంతకాలం నేను నా పవిత్రతను కోల్పోలేదు. ఎలా? అని అడగొద్దు. అది అంతే- చివరిసారిగా నీ నుండి వీడ్కోలు పుచ్చుకుందుకే ఇన్నాళ్ళు బ్రతికాను- ఆ అదృష్టం ఇప్పటికి సమకూరింది-ప్రేమించిన మగవాడికోసం స్త్రీ ఏమైనా చేస్తుంది. ప్రేమ త్యాగాన్నేకాదు కొండొకచో బలిని కూడా కోరుతుంది. ప్రేమించినవారి కోసం బలైపోవటము గొప్ప అదృష్టమే- పాలలాటి స్వచ్ఛమైన నీ జీవితంలో అపవాదుఅనే మకిలి చేరటం నేను సహించలేను. ఏ ప్రత్యేకతలేని అనామకురాల్ని. నేను ఏమైనా నాకు చింతలేదు- నీ సంగతి అలా కాదు. ఎందరికో ప్రాణదానంచేసే భగవత్స్వరూపుడివి నువ్వు- నీ అవసరం లోకానికి ఎంతో వున్నది. నీ శక్తి వ్యర్థమైపోవటం నాకు బాధగా వుంటుంది. కాబట్టి మధూ చివరిసారిగా నిన్ను ఒక్కకోరిక కోరుతున్నాను. నా కోరిక మన్నిస్తావు కదూ- ఇక్కడే నీవు డిస్పెన్సరీ తెరు- ఈ పేద ప్రజానీకానికి సేవచేసి దీన జనబాంధవుడివై నీ జీవితాన్ని చరితార్థం చేసుకో- ఏ లోకములో వున్నా- నీ కీర్తి ప్రతిష్ఠలు చూసి నా ఆత్మ తప్పక సంతోషిస్తుంది.

ఇదే నీవు నాకిచ్చేకానుక. నీశ్యామల కడసారి కోరిక తీర్చుతావుకదూ? చనిపోయేటప్పుడు కోరుకునే కోరికలు మరుజన్మలో తీరుతాయంటారు. తుదినిశ్వాస విడుస్తూకూడా ఎప్పటికైనా నేను నీదాన్ని కావాలనీ మనసారా కోరుతున్నాను. భగవంతుడు అనుగ్రహిస్తే ఎప్పటికైనా ఎన్నిజన్మలకైనా మనం తప్పక మళ్ళీ కల్సుకుంటాము. ఇప్పటికి మాత్రము ఇదే అదృష్టం ఏడవవద్దు మధూ ఏడవవద్దు నీశ్యామల నిన్నువదలి ఎక్కడకూ వెళ్ళదు. నీ మనస్సులోనే వుంటుంది. నువ్వు మెడిసిన్ కోర్సుకు వెళ్ళేనాడు నీచేతివేలికివున్న రవ్వల వుంగరం నావేలికి తొడిగేవు గుర్తున్నదా? ఆరింగులో రవ్వలే నాకిప్పుడు మార్గాన్ని చూపాయి. ఇలా చేసినందుకు క్షమించు మధూ. క్షమించు.

ఎప్పటికీ

నీ శ్యామల-

అతడి కన్నీటిపొరల్లో అక్షరాలు అలుక్కుపోయాయి చేతిలోకాగితంజారిపోయింది. రవ్వలా? నిర్ఘాంతపోయాడు. అది నీకు ఇందుకు ఉపయోగించిందా? ఇందుకే ఇచ్చానా? భగవాన్... క్షణం అతడి బుర్ర పనిచెయ్యలేదు. అంతలో కర్తవ్యం గుర్తుకువచ్చి గబగబా మెడికల్‌బాగ్ తెరిచి వెతికేడు, ఆమెకు వుపయోగించే మందులేవీ దొరకలేదు. పాతికమైళ్ళదూరంలో వున్న టౌను వెళ్ళితేగాని ఏమందులూ దొరకవు. ఇప్పటికే కాలాతీతమైపోయింది. ఏం చేయను? ఏంచేయను? అని జుట్టుపిక్కుంటూ వెర్రెత్తినట్లు ఇల్లంతా తిరిగేడు. ఏవో రెండు ఇంజక్షన్లు ఇచ్చి వాంతి అయేటట్లు చేశాడు. అంతా వ్యర్థమైపోయింది. అతడి మెడికో విజ్ఞానం అతణ్ని అపహసిస్తూంటే నిమూఢుడై అలా పిచ్చిగాచూస్తూవుండిపోయాడు. క్రమంగా ఆమెలో జీవకళ ఆరిపోయి కళ్లు మూతలు పడిపోయాయి.

శ్యామా- శ్యామా ఎంతపని చేశావు? ఇలా చేస్తావనుకుంటే నిన్ను రమ్మని కోరేవాణ్ణేకాదు. నీమాటవినలేదని ఇలా చేస్తావా? ఎప్పుడు నీ మాటవినలేదు. ఎందుకింత దారుణం చేశావు? నిన్ను వదలి ఒక్క క్షణం వుండలేననుకుంటే శాశ్వతంగా వదలి వెళ్ళటం న్యాయమేనా? శ్యామా కలిసి బ్రతకాలని మన ప్రేమ ఫూర్తి ఫలిస్తుందని ఎన్నో అనుకున్నాను. ఇంతలోనే ఇంతముక్కచెక్కలు చేసిపోయావు. ఒక్కసారి కళ్లతెరిచి చూడు నీచిన్నిపెదాలు విప్పి ఆజ్ఞాపించు. చేతులు కట్టుకుని వింటాను. శ్యామా నీకోసం అన్నీవదులుకోడానికి సిద్ధపడ్డాను. చివరికి నీవే నన్నువదిలేశావు. ఇంక దేనికోసం బ్రతకాలి. నీవు లేకుండా నేను జీవించగలననే అనుకున్నావా? నువ్వు కఠినాత్మురాలివి శ్యామా కఠినాత్మురాలివే. చూడు నాగుండె ఎలా పగిలిపోతుందో నాబాధను పంచుకునేది ఎవరు? నన్ను ఓదార్చేది ఎవరు? నీకు జాలిలేదు లేదు. శ్యామా ఆమె ముఖానికి తన ముఖం రాస్తూ పిచ్చిగా రోదించాడు. అతడి కన్నీరు ఆమె చెంపలమీద కాలువలు కట్టేయి.

